క్లుప్తంగా

రూ.2 లక్షలు పలికిన అమ్మవారి లడ్డూ ప్రసాదం



భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా పండుగ సందర్భంగా భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో నిర్వహించిన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసినఅన్నప్రసాద వితరణను వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించి భక్తులకు వడ్డించారు. సాయంత్రం అమ్మవారి దగ్గర పెట్టిన 29 కేజీల లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా 'ప్రింట్ జోన్' అధినేతలు విజయ్, ఆలీ, కోటిరెడ్డి రూ.2 లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, భేతాళ నృత్యాలు, కోలాటం నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది.

కాలే పుల్లారావుకు వెలంపల్లి అభినందనలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా కాలే పుల్లారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పుల్లారావు పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు కాలే పుల్లారావును అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు.

సాయిబాబా మందిరంలో దీపోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భవానీపురం హౌసింగ్ బోర్డ్‌కాలనీలోగల సంకల్ప సిద్ధి షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. కాగా శ్రీషిర్డీ సాయిబాబా పుణ్యతిథి (సమాధి ఉత్సవం)ని పురస్కరించుకుని మధ్యాహ్నం 2.30 గంటలకు కమిటీ సభ్యులు, సాయి సేవకులు, భక్తులు కలిసి సాయిబాబాకు సాంబ్రాణి ధూపం వేసిన అనంతరం మందిరం మూసివేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తిరిగి సాయంత్రం 6 గంటలకు మందిరం తెరిచి సాయిబాబాకు దీపోత్సవం జరిపారు. కార్యక్రమంలో మందిరం పాలకవర్గ అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పీవీఎల్ ప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పి.రజనీకాంత్, జీవీ కృష్ణ, వై. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని విజయవాడ నోడల్ డివిజన్ డెప్యూటీ కమిషనర్ కె.అపర్ణ అన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్, జీఎస్టీ కార్యాలయం, జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ఎంఎస్ఎంఈలకు జరిగే లబ్ధిని తెలియజేసేందుకు 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్' పేరుతో అవగాహన సదస్సును ఆటోనగర్‌లోని ఆ సంఘ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన అపర్ణ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల ఫలితంగా దేశంలోని అన్ని రంగాల అభివృద్ధికి ఊతమిస్తున్నట్లు చెప్పారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజల జీవన పరిస్థితులు సైతం మెరుగుపడతాయన్నారు. ప్రధానంగా ఎంఎస్ఎంఈ రంగంలో చాలా మార్పులకు ఈ తగ్గింపు అండగా ఉంటుందన్నారు. ఆయా సంస్థల అభివృద్ధికి సైతం అవకాశముంటుందన్నారు. ఈ తగ్గింపుపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆటోనగర్ సర్కిల్ సహాయ కమిషనర్ పి.పుల్లయ్య, రామవరప్పాడు సర్కిల్ సహాయ కమిషనర్ గోపీచంద్, గొల్లపూడి సర్కిల్ సహాయ కమిషనర్ ఎస్.ప్రజ్ఞారాధిక, ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవాధ్యక్షులు బాయన వెంకట్రావు, అధ్యక్షులు డి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రామచంద్రరావు, కోశాధికారి జీవీఎస్ఆర్కే ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన దసరా మహోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని వివిధ ఆలయాల్లో దసరా మహోత్సవాలు గురువారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. కొత్తపేట గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కొత్తపేట బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న చదునుమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అష్టలక్ష్మీ అమ్మవార్లు సైతం విశేష అలంకారంలో దర్శనమివచ్చారు. సాయంత్రం అమ్మవారికి నగరోత్సవాన్ని నిర్వహించారు. శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో శమీపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావు తదితరులు పాల్గొన్నారు. కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలో సాయంత్రం ఉత్సవమూర్తులను వేంచేయింపజేసి శమీపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా సంకీర్తనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే శ్రీ కన్యకాపరమేశ్వరి, నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలోని ఉత్సవమూర్తులను కూడా ఆలయ ప్రాంగణంలో శమీపూజను నిర్వహించారు. పాండురంగస్వామి దేవస్థానంలోనూ శమీపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు పులిపాక రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు. కేబీఎస్ కళాశాల ఆవరణలోని శ్రీ దాసాంజనేయ స్వామి అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



ఆలయ ప్రాంగణంలో శమీపూజ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని పలు ఆలయాల్లో నిర్వహించిన దసరా ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. గురువారం చిట్టినగర్ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, పాలప్రాజెక్టు ఎదురుగా ఉన్న గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపించారు. సాయంత్రం ఆయా ఆలయాల్లో శమీపూజను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పాలప్రాజెక్టు ఎదురుగా ఉన్న గంగానమ్మ వారి దేవస్థానంలో శుక్రవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక సేవా సంఘం ఆధ్వర్యంలో 11 రోజుల పాటు దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించామని సంఘ అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పేర్కొన్నారు. 11 రోజులు 11 విశేష అలంకారాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారన్నారు. కుంచం శ్రీనివాసరావు, ఉమ్మడిశెట్టి వెంకట దుర్గ శివనాగేంద్ర, యోదుపాటి వెంకటేశ్వర్లు, పట్నాన అప్పారావు, తమ్మిన సతీష్ దంపతులు పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానానికి తమవంతు సహకారం అందించారన్నారు.



శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భ్రమరాంబ అమ్మవారు



విజయలక్ష్మీదేవిగా పద్మావతి అమ్మవారు

కనుల పండువగా నగరోత్సవం....

చిట్టినగర్ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన దసరా ఉత్సవాలలో 11వ రోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారికి నగరోత్సవ సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన నగరోత్సవం చిట్టినగర్, కేటీరోడ్డు, కొత్తపేట మీదగా సాగాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తజనుల కోలాట నృత్యాల మధ్య నగరోత్సవం సాగింది. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, బెవర సూర్యనారాయణ, పాట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, కామందుల నరసింహారావులతో పాటు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమన వారి పేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా ఉత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. గురువారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. యాగశాలలో అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శమీపూజ నిర్వహించారు.



పాండురంగస్వామి సన్నిధిలో శమీపూజ



విజయదుర్గా ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం



కొత్తగుళ్లు ప్రాంగణంలో శమీపూజలో కొలువైన కోదండరాముడు



కొత్త అమ్మవారి సన్నిధిలో నగరోత్సవం



గంగానమ్మ వారి దేవస్థానంలో భక్తులకు అన్నప్రసాద వితరణ

గాంధీ మార్గంలో నడవాల్సిన బాధ్యత అందరిది

విజయవాడలీగల్: అహింస, సత్యమేవ జయతే అనే ధర్మాలను పాటించాలని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతిని బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకే బాషా మాట్లాడుతూ గాంధీ 19 సంవత్సరాలకే న్యాయవాద వృత్తిని చేపట్టారని, న్యాయవాద వృత్తితోపాటు ప్రజా సంక్షేమం కోసం పోరాడుతూ అనేక పోరాటాలు చేసి స్వాతంత్ర్యం సంపాదించి ప్రజా సంరక్షణ కోసం అసువులు బాసారని గుర్తుచేశారు. మనం కూడా ఆయన బాటలోనే నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బెజవాడ బార్‌లో ప్రాక్టీస్ చేసి న్యాయమూర్తులైన బి.సాదుబాబు, జి.దీన బాబు, రత్నకుమార్, పి. లలితలను అతిథులుగా ఆహ్వానించారు. బీబీఏలో న్యాయవాద వృత్తిని చేస్తూ, న్యాయమూర్తులుగా ఎదిగిన వారు మళ్లీ బార్ అసోసియేషన్‌కి రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ఇదే బార్ అసోసియేషన్‌లో న్యాయవాద వృత్తి ఉండి ఇలా అతిథులుగా ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. జూనియర్ న్యాయవాదులు కూడా కష్టపడి ఉన్నత స్థితికి రావాలని కోరారు. ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గాంధీ జయంతిని గాంధీ ఉత్సవ్ పేరుతో బెజవాడ బార్ అసోసియేషన్‌లో నాలుగు రోజులు ముందు నుంచే జరపటం గాంధీ స్మృతులను గుర్తు చేసుకుంటూ సబర్మతి ఆశ్రమాన్ని ఏర్పాటు చేయటం, వాటితో పాటు గాంధీ జీవిత చరిత్ర ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయటం గొప్పవిషయమన్నారు. అనంతరం కూచి పూడి నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. భవనారాయణ, డేవిడ్ రత్నకుమార్, ఉమా మహేశ్వర్‌రెడ్డి, ముత్యాల రామారావును ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బెజవాడ బార్ అసోసియేషన్ గవర్నమెంట్ బాడీ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీబీఏ నాయకులు

గాంధీజీ ఆశయాలు ప్రపంచానికే ఆదర్శం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గాంధీజీ ఆశయాలు ప్రపంచానికే ఆదర్శప్రాయమని ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాంపిళ్ల జయప్రకాష్ పేర్కొన్నారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని పాలప్రాజెక్టు సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలోని గాంధీజీ దేవాలయంలో ఆయన జయంతి నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జయప్రకాష్ తో పాటు ప్రముఖ మెజీషియన్ ఎస్ఎన్. రోహిణీ కాంత్, ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన హనుమ, తమ్మిన సోనియా, తమ్మిన మారుతీ, ఎస్‌కె. హుస్సేన్, సింహాద్రి, తొత్తడి సతీష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు ముంపు శాశ్వత నివారణకు నిధులివ్వాలి

సీఎం చంద్రబాబుకు సీపీఎం బహిరంగ లేఖ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు శాశ్వత నివారణకు రూ. పది వేల కోట్లు నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావు అన్నారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని ఎంబీ స్టేడియంలో 'వాహన మిత్ర పథకం' ప్రారంభోత్సవానికి శనివారం వస్తున్న సీఎంకు, రాష్ట్ర ప్రభుత్వానికి బుడమేరు వరద బాధితుల తరుపున సీపీఎం విజయవాడ నగర కమిటీ బహిరంగ లేఖ శుక్రవారం విడుదల చేసింది. ఆ లేఖలోని వివరాలను శ్రీశ్రీ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో బాబూరావు వెల్లడించారు. శనివారం జరుగుతున్న సభలోనే బుడమేరు శాశ్వత చర్యల మీద ప్రకటనే కాకుండా, నిధులు విడుదల చేయించాల్సిన బాధ్యత నగరంలోని అధికార టీడీపీ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ఆటో కార్మికులకు రూ.15 వేలే కాకుండా 25 వేలు, సొంత ఆటో లేని ఆటో డ్రైవర్లందరికీ సహాయం ప్రకటించాలి. ఈ ఛలానాలు, ఫెనాల్టీల మీద ఎమ్మెల్యే బోండా ఉమా మాట్లాడటమే గాక సీఎంపై వత్తిడి తీసుకొచ్చి వీటిని ఆటో కార్మికుల సభలోనేరద్దు చేస్తూ తమ నిజాయితీని రుజువు చేసుకోవాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు సిటీ కమిటీల కార్యదర్శులు బోయి సత్యబాబు, భూపతి రమణారావు, పి.కృష్ణ పాల్గొన్నారు.



సీఎంకు రాసిన బహిరంగ లేఖను ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

కొనసాగుతున్న భవానీ భక్తుల రద్దీ

భవానీలతో కిటకిటలాడిన ఘాట్‌లు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారంతో ముగిసినప్పటికీ భవానీల రద్దీ కొనసాగుతూనే ఉంది. శుక్రవారం భవానీ మాలదారులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలిరావటంతో కేనల్‌రోడ్డు, భవానీ ఘాట్, పద్మావతి ఘాట్‌లు కిటకిటలాడాయి. దసరా ఉత్సవాల అనంతరం ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు కుటుంబ సభ్యులతో తరలిరావటంతో వినాయకుని గుడి నుంచి క్యూ లైన్‌లు, ఆలయ పరిసర ప్రాంతాలు భక్తుల రద్దీతో కటకిటలాడాయి. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, మహిళల కోసం లిఫ్ట్ మార్గంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భవానీ భక్తులలో కిటకిటలాడిన ఘాట్‌లు...

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భవానీ భక్తులతో పద్మావతి ఘాట్, భవానీ ఘాట్‌లు రద్దీగా మారింది. కృష్ణానదిలో పెగిరిన వరద ప్రవాహం కారణంగా అధికారులు ఘాట్‌లలో బారికేడ్లు ఏర్పాటు చేసి జల్లు స్నానం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం ఘాట్‌లను పర్యవేక్షించే సిబ్బంది లేకపోవడంతో ఒక దశలో భక్తుల తోపులాటలు జరిటాయి. వెంటనే అధికారులు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



భవానీ భక్తులతో రద్దీగా మారిన క్యూ లైన్‌లు



జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు

అధికారుల ప్రత్యేక ఏర్పాట్లు...

దసరా ఉత్సవాల అనంతరం భవాని భక్తుల రద్దీ పెరగటంతో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ రద్దీ ఆదివారం వరకు కొనసాగనున్నట్లు ఆలయ అధికారులు అంచనాతో అప్పటి వరకు ఉచితంగా అన్ని క్యూ లైన్‌లలో భక్తులకు ప్రవేశం కల్పించారు. తాగునీరు, అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. అన్ని రద్దీ ప్రాంతాలలో సంబధిత అధికారులకు విధులు కేటాయిస్తు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ ఈఓ శీనానాయక్ స్వయంగా క్యూ లైన్‌లను పర్యవేక్షిస్తు భక్తులతో మాట్లాడి వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం బంగారు వాలికి క్యూ లైన్ మినహా అన్ని క్యూ లైన్‌లో భక్తులను అనుమతించినట్లు ఆయన వెల్లడించారు. వీలైనంత వరకు ఎక్కువ సమయం ఆలయం తెరచి ఉంచి, మరుసటి రోజు త్వరగా దర్శనం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నట్లుగా తెలిపారు.



భవానీ భక్తులతో కెనాల్ రోడ్డు

6న కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు, భవానీలు అమ్మవారికి సమర్పించిన కానుకలను 6వ తేదీ నుంచి 8వతేదీ వరకు లెక్కింపు చేపడతామని ఆలయ అధికారులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం మహామండపంలోని ఆరో అంతస్తులో లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సబ్సిడీపై సార్టెడ్ సెమెన్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఉభయ కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలో పాడి పశువుల కోసం సబ్సిడీపై సార్టెడ్ సెమెన్ (లింగ నిర్ధారిత వీర్యం)ను అందచేస్తున్నామని సీఎం చంద్రబాబునాయుడికి కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు వివరించారు. గొల్లపూడిలో ఏర్పాటు చేసిన అగ్రికల్చరల్ పేవిలియన్‌ను సీఎం చంద్రబాబునాయుడు గురువారం సందర్శించారు. పేవిలియన్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.150కు అందిస్తున్న సార్టెడ్ సెమెన్‌ను కృష్ణా మిల్క్ యూనియన్ మరో వంద రూపాయలు సబ్సిడీపై కేవలం రూ.50కు అందిస్తున్నామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతుల సంక్షేమానికి చేపట్టిన పలు పథకాల గురించి ఆంజనేయులు వివరించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడినవారిని శిక్షించాలి

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం మాజీ అధ్యక్షుడు కిరణ్ రాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ):చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళం పేట గ్రామంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడినవారిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం మాజీ అధ్యక్షుడు, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దాడి ఒక అంబేడ్కర్ విగ్రహంపైనే కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బడుగు, బలహీనవర్గాలకు జరిగిన అవమానంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై అనేక దాడులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల ఆత్మగౌరవానికి చిహ్నమైన డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో నెలకొల్పితే నేడు కూటమి ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను ఏ విధంగా చూడాలని ప్రశ్నించారు.

నేత్రపర్వంగా శ్రీవారి గరుడోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో వెంకటేశ్వరస్వామి గరుడోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపు రోజైన విజయదశమి రోజున స్వామి వారి సన్నిధిలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి విజయలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష అర్చనలను నిర్వహించారు. అలాగే స్వామి వారికి గరుడవాహనంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవ మూర్తులను గరుడవాహనంపై అధిష్టింపజేసి మేళతాళాలతో నగరోత్సవాన్ని నిర్వహించారు. బ్రాహ్మణవీధిలోని స్వామి వారి ఆలయ ప్రాంగణం నుంచి బయలుదేరిన నగరోత్సవం నెహ్రూబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా కొత్తపేట కేటీరోడ్డులోని జమ్మి వెంకటేశ్వరస్వామి వారి ప్రాంగణానికి చేరుకుంది. అక్కడ స్వామి వారిని వేంచేయింపజేసి శమీపూజను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అక్కడకు చేరుకొని పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించగా ఆలయ పండితులు శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో అర్చకస్వాములు పొన్నంగిపల్లి దీక్షిత్ తదితరులు పూజలు నిర్వహించారు.



గరుడవాహనాన్ని అధిష్టించి నగరోత్సవానికి వెళ్తున్న వెంకటేశ్వరస్వామి వారు

• భవానీ మాతకు జై..

దసరా ఉత్సవాలు ముగిసినా భవానీ భక్తుల రాకతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. దుర్గమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన వేలాది మంది భవానీలతో క్యూలైన్లు రద్దీగా మారాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భవానీలు తరలివచ్చారు. కనకదుర్గమ్మ కాపాడు తల్లి అంటూ భవానీలు అమ్మవారిని స్మరించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కొండపైకి వెళుతున్న భవానీలు





కేరళ వాయిద్యాల సందడి



కృష్ణవేణి ఘాట్ వద్ద భవానీలు



5న 'అమృత మంజరి' ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ):భగవంతుడు ఒక్కడే..మనమందరం ఆయన సృష్టే అన్న భావనను ప్రపంచ వ్యాప్తంగా చైతన్యం కలిగించేందుకు కృషి చేస్తున్నామని మనుజ్యోతి ఆశ్రమం నిర్వాహకులు జయప్రకాష్ పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన గొల్లపూడిలోని పద్మావతి కళ్యాణ మండపంలో 'అమృత మంజరి–అంకురం2' (తన ప్రేమగల చేతుల నైపుణ్యం) ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. శుక్రవారం భవానీపురంలోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేదాలు, పురాణాల్లోని సారాంశాన్ని అందరికీ సులభంగా అర్థమయ్యేలా చిన్నచిన్న పుస్తకాల రూపంలో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఒకే దేవుడు – ఒకే దేశం అనే సత్యాన్ని విశ్వసించి జాతి, మత, వర్గ, ప్రాంతీయ భేదాలు లేకుండా ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు నరేంద్ర, నానాజీ, రంగారావు, మహారావు, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక ఆవిష్కరణకు సంబంధించిన ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.